ప్రజాశక్తి

శుక్రవారం 29 మార్చి 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





యథేచ్ఛగా ఆక్రమణలు



- రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములపై రెవెన్యూ మీనమేషాలు
- భూములు, గెడ్డలు కబ్జాపై ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఫిర్యాదులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోనూ జిల్లాలోనూ ఓ వైపు ఎన్నికల కోలాహలం నడుస్తుండగా సందట్లో సడేమియా అన్న చందాన రాజకీయ రాబందులు కొన్ని ప్రభుత్వ భూముల కబ్జా కోసం శతవిధాలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్ ప్రాంతాల్లో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపికి చెందిన వారు ఇక్కడ ఏకమవ్వడం ఏళ్లతరబడి సాగుతుండడంతో బాధితుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుంది. రెవెన్యూలో ఉన్నతాధికారుల పాత్ర గణనీయంగా ఉందని జాతీయ మానవ హక్కుల సంఘం ప్రతినిధి శ్యామ్ ప్రసాద్ త్వరలో వీటిపై ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిల్) వేయనున్నట్లు ప్రజాశక్తికి తెలిపారు.

ఆక్రమణల పరంపర...

విశాఖ గ్రామీణ రూరల్ తహశీల్దార్ కార్యాలయం పరిధిలోగల రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్, వివేకానందనగర్ పరిధిలోగల పలు ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డలన్నీ అధికార వైసిపి, పలుచోట్ల తెలుగుదేశం నేతల భాగస్వామ్యంతో మాయం అవుతున్నాయి. ఈ వ్యవహారంపై రెవెన్యూకు పదుల సంఖ్యలో ఫిర్యాదులు చేసినా రూ.కోట్ల విలువైన భూములను కాపాడలేని స్థితిలో రెవెన్యూ అధికారులున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలే జాతీయ మానవ హక్కుల సంఘానికి (ఎన్‌హెచ్‌ఆర్‌సి) ఈ ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త అల్లూరి శివపార్వతి ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడ నుంచి విశాఖ జిల్లా రెవెన్యూ అధికారులకు సైతం తాఖీదులు రావడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి వారిలో నెలకొంది. నిత్యం భూ కబ్జాదారులతో చేతులు కలిపి పబ్బం గడుపుకునే అలవాటుగల ఈ ప్రాంత రెవెన్యూ ఉన్నతాధికారులకు ఎన్‌హెచ్‌ఆర్‌సి జోక్యం మింగుడు పడని అంశంగా ఉందన్నది తెలుస్తోంది.

ఆక్రమణకు దిగడం ఆపై ఎవరైనా అడ్డుపెడితే రెవెన్యూ రావడం...

ఈ ప్రాంతంలో భూములు, ప్రభుత్వ గెడ్డలు కబ్జాకు గురౌతున్నా రెవెన్యూ చూసీచూడనట్టు వ్యవహరిస్తోంది. వార్డు స్థాయి సచివాలయ సిబ్బంది సైతం రాజకీయ పలుకుబడికి లొంగిపోయి వ్యవహరించడం ఈ ప్రాంతంలో కనిపిస్తోంది. జోన్ -2 పరిధిలో 8వ వార్డు రాజీవ్‌నగర్ బస్‌స్టాప్ వద్ద ప్రభుత్వ భూమి 60 గజాల వరకూ ఉంటుంది. దీన్ని ఓ రాజకీయ పార్టీకి చెందిన వారు కబ్జాకు ఇటీవలే సిద్ధం కాగా ఈ వ్యవహారంపై రెవెన్యూ, జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఎన్‌హెచ్‌ఆర్‌సి జోక్యం చేసుకుని ఈ వ్యవహారంపై దర్యాప్తునకు రెవెన్యూకు ఆదేశించగా హుటాహుటిన ఇక్కడ కబ్జాదార్లు పడేసిన ప్రభుత్వ బోర్డులను మరలా తీసి పాతించారు. పై నుంచి చెబితే గానీ రెవెన్యూ కనీసం కబ్జాలపై స్పందించని స్థితి కొనసాగుతోంది. రుషికొండలో గెడ్డ ఆక్రమణలపైనా ఇదే తంతు ఇటీవలే నడిచింది. సర్వే నెంబరు 18 నుంచి 21 వరకూ మరలా 28, 45, 48 లో గెడ్డలున్నాయి. సుమారు 18 ఎకరాల వరకూ ఉంటుంది. ఈ భూమంతటినీ కొట్టేయాలని అధికార పార్టీ పెద్దలు చూడగా ఫిర్యాదులతో ఇటీవల వీటిపై రెవెన్యూ అధికారులు కదిలి ఈ భూమిని కాపాడారు. రెవెన్యూ తమ విధుల్లో భాగంగా ఈ తనిఖీలు, పర్యవేక్షణలేవీ చేయకపోవడంతో భూ కబ్జాలు నానాటికీ పేట్రేగిపోతున్నాయి.

భూ ఆక్రమణలపై పిల్ వేస్తున్నాను : శ్యామ్ ప్రసాద్

విశాఖపట్నంలోని రుషికొండ, మధురవాడ, గుడ్లవానిపాలెం, పరవాడ ప్రాంతాల్లో భూ ఆక్రమణలు అధికంగా జరిగాయని వీటన్నిటిపైనా కోర్టులో పిల్ వేస్తున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపి సెక్రటరీ, జాతీయ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు శ్యామ్‌ప్రసాద్ ప్రజాశక్తికి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ

మిగతా 2లో..

స్థానికతపై చర్చ

డబ్బు బలం ధీమాలో సిఎం.రమేష్
ముత్యాలనాయుడు పోటీతో తెరపైకి లోకల్ అంశం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి ఎంపీ అభ్యర్థుల స్థానిక, స్థానికేతరపై చర్చ నడుస్తోంది. అనకాపల్లి జిల్లాలోని దేవరాపల్లి మండలానికి చెందిన ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడును ఎంపీ అభ్యర్థిగా వైసిపి ప్రకటించిన తరువాత ఈ తరహా చర్చకు అవకాశం ఏర్పడింది. హైదరాబాద్‌లో స్థిరపడ్డ కడపకు చెందిన సిఎం రమేష్‌ను అనకాపల్లి నుంచి పోటీ చేయించడంపై టిడిపి, జనసేన కార్యకర్తల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పొత్తులో పెందుర్తి టిక్కెట్ కోల్పోయిన టిడిపి సీనియర్ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తికి గానీ, ఆయన కుమారుడు అప్పలనాయుడుకు గానీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి టికెట్ ఇచ్చినా సీనియర్లను గౌరవించినట్లు ఉండేదన్న అభిప్రాయం వారిలో ఉంది. అయ్యన్నపాత్రుడు తనయుడు విజయ్‌కు ఎంపీ టిక్కెట్ ఇవ్వడానికి చంద్రబాబు ససేమిరా అన్నా, బండారు కుటుంబం నుంచి ఒకరికి ఎంపీ టికెట్ ఇచ్చినా సమతుల్యత పాటించినట్లుండేదని బండారు అనుచరులు, టిడిపి నాయకులు అంటున్నారు. అనకాపల్లి పార్లమెంట్ సరిహద్దులు తెలియని, ప్రజా సమస్యలు ఎరుగని, స్థానికేతరుడైన వ్యాపారవేత్త సిఎం రమేష్‌ను బిజెపి నుంచి బరిలో దించడంపై ఆ పార్టీ నాయకత్వంలోనూ అసంతృప్తి వుంది.

స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా జరుగుతున్న సుదీర్ఘపోరాటానికి మద్దతుగానీ, స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టొద్దన్న మాటగానీ, ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి ఆదుకోవాలన్న సూచనగానీ రాజ్యసభలోనూ, బయటా వ్యక్తం చేయని సిఎం.రమేష్, ప్రజలకు ఏమి చేస్తాడన్న ప్రశ్నలు విన్పిస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన బిజెపి నుంచి రమేష్ బరిలోకి దిగడం వెనుక డబ్బుతో గెలవచ్చున్న ధీమా ఆయనలో ఎక్కువగా ఉన్నట్లుంది. తన సామాజిక తరగతిని ప్రచారం చేసుకొని ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న ప్రయత్నం మొదలుపెట్టారు. ఎన్నికల తరువాత కన్పించని వ్యక్తి కంటే, జిల్లాకు చెందిన స్థానికుడు, ప్రజలకు అందుబాటులోవుండే ముత్యాలనాయుడును గెలిపించుకోవాలన్న ప్రచారం వైసిపి నుంచి బలంగా వెళ్తోంది. ఈ ఎన్నికల్లో స్థానిక, స్థానికేతర అభ్యర్థి ప్రచారం జోరుగా సాగేలావుంది. స్థానికుడన్న ముత్యాల నాయుడుపై ఉన్న సానుకూలతను

మిగతా 2లో..

సరుకు రవాణాలో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

వార్త మెయిన్‌లో..

ఎన్‌ఫోర్స్‌మెంట్ టీములు చురుకుగా పనిచేయాలి

వార్త 8లో..

మహిళను కాపాడిన లైఫ్ గార్డులు

వార్త 2లో..

146 ఒడిశా మద్యం బాటిళ్లు స్వాధీనం

వార్త 3లో..



సమతానగర్ జంక్షన్‌లో నగదు పట్టుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్

రూ.లక్ష పట్టివేత

ప్రజాశక్తి -గాజువాక: ఎన్నికల వేళ నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికార యంత్రాంగం తనిఖీలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం గాజువాక సమతానగర్ జంక్షన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం నిర్వహించిన తనిఖీల్లో కారులో సరైన ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు.

గాజువాక మండలం గాజువాక ఆటోనగర్‌లో నివాసముంటున్న రాహుల్ పాత్రో అనే వ్యక్తి కారులో పెదగంట్యాడ వైపు వెళుతుండగా, సమతానగర్ జంక్షన్ వద్ద ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు ఖుర్దీష్, అచ్యుతరావు, రాము తనిఖీలు

మిగతా 2లో..

ఎలాంటి ప్రచారానికైనా అనుమతి తప్పనిసరి

జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున

ప్రజాశక్తి-విశాఖపట్టణం : రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేపట్టబోయే ఎలాంటి ప్రచారానికైనా సంబంధిత ఎన్నికల అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సిందేనని జిల్లా ఎన్నికల అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తేల్చిచెప్పారు. జిల్లా వరకు జిల్లా ఎన్నికల అధికారి, అసెంబ్లీ నియోజవర్గాలకు సంబంధించి అక్కడి ఆర్‌ఒలు అనుమతులు ఇస్తారని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై చర్చించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ పలు సందేహాలను నివృత్తి చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఇతర నిబంధనలపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, ఇతరులకు తెలియజేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో భాగంగా జిల్లా కలెక్టర్ పలు అంశాలపై మాట్లాడుతూ, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ప్రచారం నిర్వహించాలన్నా, రాజకీయపరమైన కార్యకలాపాలు చేపట్టాలన్నా సంబంధిత ఎన్నికల అధికారుల నుంచి తప్పకుండా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోగా ఏకగవాక్ష విధానం ద్వారా అనుమతులు ఇస్తామని, వివరాలన్నీ సక్రమంగా ఉంటే 24 గంటల్లో కూడా అనుమతులు జారీ చేస్తామని తెలిపారు. సువిధ యాప్‌లో లేదా ప్రత్యక్షంగా పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సింగిల్ విండో విభాగంలో, అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పార్టీల ప్రతినిధులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అన్ని రకాల అంశాలకు ఒకేసారి దరఖాస్తు చేసుకొంటే అనుమతుల జారీ ప్రక్రియ సులువవుతుందన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో ఇచ్చే అనుమతులకు సంబంధించిన నిబంధనల గురించి ప్రతినిధులకు వివరించారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున

ఏప్రిల్ 14 వరకు ఓటు నమోదు, బదిలీకి అవకాశం

ఏప్రిల్ 14వ తేదీ వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు ఫారం-6 సమర్పించవచ్చని కలెక్టర్

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

యథేచ్ఛగా ఆక్రమణలు

భూ ఆక్రమణల్లో అడ్డగోలుతనం, నిర్మాణాల్లో నిబంధనల ఉల్లంఘనలు రుషికొండ, మధురవాడ, పరవాడల్లో అధికంగా ఉన్నాయన్నారు. ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి ఇలాంటి వ్యవహారాలను సుమారు 1000కు పైగా ఇర్రెగ్యులర్ భూ బదలాయింపులు చేశారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఈయనపై ఎన్నికల సంఘానికి ఇటీవలే ఫిర్యాదు చేయగా ఎన్నికలకు సంబంధించిన పలు విధుల నుంచి ఆయన్ను తొలగించారని, ఆర్‌ఒగా కూడా తొలగించే అవకాశముందని శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

స్థానికతపై చర్చ

ప్రలోభాలతో తమకు అనుకూలంగా మలచుకొనేందుకు రమేష్ కుటుంబ సభ్యులు, బంధువులు నియోజకవర్గాల్లో సంచరిస్తున్నారు. అభ్యర్థి ఇప్పటి వరకు నియోజకవర్గంలో అడుగుపెట్టకపోయినా, ఆయన బంధువులు, కుటుంబ సభ్యులు కొంతమంది నాయకులను ఆకర్షించే అన్వేషణలో పరిచయస్తులను కలుస్తున్నారు.

రూ.లక్ష పట్టివేత

నిర్వహించగా, బ్యాగ్‌లో రూ.లక్ష నగదు పట్టుబడింది. పెదగంట్యాడ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళుతున్నానని సంబంధిత వ్యక్తి చెప్పినప్పటికీ, దీనికి సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

ఎలాంటి ప్రచారానికైనా అనుమతి తప్పనిసరి

చెప్పారు. ఫారం -8 కేవలం ఓటు బదిలీ నిమిత్తం సమర్పించుకోవచ్చని చెప్పారు. మార్చి 16 ముందు తేదీ నాటికి వచ్చిన అన్ని రకాల దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు చేపట్టామని, అన్ని రకాల చేర్పులు, మార్పులు చేశాక మార్చి 27వ తేదీ నాటికి జిల్లాలో ఓటర్ల సంఖ్య 19,80,194గా నమోదైందని వివరించారు. ఇప్పటి వరకు 4,67,049 ఎపిక్ కార్డులు పోస్టల్ ద్వారా ఓటర్లకు అందజేశామని చెప్పారు. కొత్తగా వచ్చే దరఖాస్తుల పరిశీలనలో భాగంగా బిఎల్‌ఒ క్షేత్రస్థాయిలో ఓటరు వద్దకు వెళ్లి సెల్ఫీ పెట్టాల్సి ఉందన్నారు.

నియమావళి అమలుకు 89 బృందాలు

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు 89 బృందాలు పని చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో వివిధ రకాల ఘటనల్లో 15 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామని చెప్పారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 26 ఫిర్యాదులు నమోదు కాగా 25 ఫిర్యాదులను పరిష్కరించామని వెల్లడించారు. సి.విజిల్ యాప్ ద్వారా 173 ఫిర్యాదులు నమోదు కాగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన 130కి నిర్ణీత కాలంలో పరిష్కారం చూపామని పేర్కొన్నారు. 100 నిమిషాల్లో 107 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.53 లక్షల నగదును సీజ్ చేసినట్లు వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా వ్యవహరించిన వాలంటీర్లపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నామని చెప్పారు. వాలంటీర్లు ఎట్టిపరిస్థితుల్లోనూ ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనకూడదని స్పష్టం చేశారు.

31న పోలింగ్ బూత్ అవేర్‌నెస్ కార్యక్రమం

జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ఈ నెల 31వ తేదీన పోలింగ్ బూత్ అవేర్‌నెస్ కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వినూత్న కథా చిత్రం 'దెయ్యం చెప్పిన సాక్ష్యం'

- హీరో, డైరెక్టర్ ప్రవీణ్ చక్రవర్తి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎంఎంఎం క్రియేషన్స్ హైదరాబాద్ బేనర్‌పై తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, బొజ్‌పూరి భాషల్లో నిర్మితమవుతున్న 'దెయ్యం చెప్పిన సాక్ష్యం' రూపొందిస్తున్నట్లు హీరో, డైరెక్టర్ ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మంచి- చెడుకు ఉన్న తేడా, రెండు కాలాల మధ్య జరిగిన కథాంశంతో సినిమా తీస్తున్నామన్నారు. ఇది సంగీత ప్రధాన సినిమా అన్నారు. నమ్మకానికి, పవిత్ర ప్రేమకు మధ్య జరిగిన కథే ఈ సినిమా అని చెప్పారు. ఉత్తర భారతదేశంలో జరిగిన కథతో తీసే ఈ సినిమాలో ఇద్దరు కొత్త హీరోయిన్లు ఉన్నారన్నారు. దెయ్యం కోర్టులో చెప్పే సాక్ష్యం చుట్టూ వినోద బరితంగా సాగే కథ అని వివరించారు. తాను గతంలో కో - డైరెక్టర్‌గా పని చేశానని తెలిపారు. పలు తెలుగు, తమిళ భాషల్లో మమ్ముట్టి, ప్రభుదేవా, అర్జున్ తదితర హీరోలకు డబ్బింగ్ చెప్పానని తెలిపారు. నిర్మాత జగపతిరాజు మాట్లాడుతూ, మంచి చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. నిర్మాత పీలా నీల తిలక్ మాట్లాడుతూ, తాను నిర్మించిన 'నా చెలియా' సినిమాకు ప్రవీణ్ సహకారం అందించరని గుర్తు చేశారు.

సామాజిక న్యాయం కోసం పోటీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సామాజిక న్యాయం కోసం ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వచ్చామని సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వరరావు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ పార్టీ విశాఖ దక్షిణ టికెట్ హిజ్రా సూరాడ ఎల్లాజీకి ప్రకటించామన్నారు. ఉత్తరాంధ్రలో 32 లక్షల ఎకరాల భూములుండగా, 8 లక్షల ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందుతోందన్నారు. అయినా ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదన్నారు. ముందుగా సుజల స్రవంతిని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖలో పట్టుబడిన డ్రగ్స్ విషయంలో వైసిపి, టిడిపి వారే కుట్రదారులని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూహక్కు చట్టం వల్ల ప్రజల ఆస్తులు వారికి కాకుండా పోతాయని, ప్రభుత్వమే బదలాయింపు చేస్తోందని ఆరోపించారు. మూడు రాజధానుల పేరుతో విశాఖలో వందల కోట్ల విలువైన భూములను అధికార పార్టీ పెద్దలు స్వాహా చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక, లిక్కర్, ల్యాండ్ మాఫియా ఆరు జోన్ల కింద దోపిడీ సాగుతోంది అన్నారు. దేశంలో మైనారిటీల మీద బిజెపి దాడులు చేస్తోందన్నారు. ఏప్రిల్ 4న పార్టీ మేనిఫెస్టో విడుదల చేస్తామని, రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు తమ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఉత్తరాంధ్ర ఇంఛార్జి జాలాది విజయ, మాట్లాడుతూ, తాను విశాఖ పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. మతాలను రెచ్చగొట్టి మణిపూర్‌లో విద్వేషాలకు కారణమైన మోడీని ఓడించాలని కోరారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనా గురవయ్య మాట్లాడుతూ, బిజెపికి చెందిన మాధవ్ ఎమ్మెల్సీగా ఉన్నపుడు ఉద్యోగాల పేరిట అనకాపల్లి జిల్లాలో రూ.కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. అనకాపల్లిలో బిజెపి పార్లమెంట్ అభ్యర్థి సిఎం రమేష్‌ను ఓడిస్తామన్నారు. ఈ మీడియా సమావేశంలో పార్టీ నాయకులు కళ్యాణ్ యాదవ్, లలితా మాత, ఒమ్మి వెంకట్ యాదవ్, శరత్, రాజు, ఓంకార్, కోనా విజయలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం, డ్రగ్స్ మయంగా జగన్ పాలన

టిడిపి జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి



మాట్లాడుతున్న గండి బాబ్జీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జగన్ పాలనలో నిరుద్యోగం, మద్యం, డ్రగ్స్ తాండవిస్తున్నాయని జిల్లా టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి ఆరోపించారు. జిల్లా టిడిపి కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో దోపిడీలు నిత్యకృత్యం అయిపోయాయని, ప్రశ్నిస్తున్న వారిని పోలీసులతో బెదిరిస్తున్నారని, దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామ పంచాయతీ వ్యవస్థను జగన్మోహన్‌రెడ్డి నాశనం చేశారన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికలలో జగన్‌కు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఇంటర్నేషనల్ డాన్ అని ఆరోపించారు. ఇతర దేశాలను మేనేజ్ చేసి విశాఖకు కంటైనర్ తెప్పించారని, విశాఖ డ్రగ్స్ కేసును అవినాష్‌రెడ్డి కేసు లాగే నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కాపాడబడిన మహిలతో లైఫ్‌గార్డులు, పోలీసులు

మహిళను కాపాడిన లైఫ్ గార్డులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : యారాడ సముద్ర ప్రాంతంలో మహిళ ఆత్మహత్యాయత్నాన్ని జివిఎంసి లైఫ్‌గార్డులు గురువారం అడ్డుకొని ప్రాణాలను కాపాడారని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన తేజు (24) కుటుంబ సమస్యల కారణంగా గురువారం ఉదయం యారాడ బీచ్‌లో ఆత్మహత్యకు ప్రయత్నించగా జివిఎంసి లైఫ్‌గార్డులు కె.లోవరాజు, కె.వెంకటేష్, సి.హెచ్.శ్రీనివాస్ అడ్డుకున్నారని తెలిపారు. ఆమెకు కౌన్సెలింగ్ చేసి సంబంధిత పోలీసులకు అప్పగించారని పేర్కొన్నారు. విశాఖపట్నం బీచ్‌లలో సముద్రంలోకి దిగి ప్రమాదాలను ఎదుర్కొనే పర్యాటకులు, యాత్రికులను జివిఎంసి లైఫ్‌గార్డులు నిరంతరం పర్యవేక్షించడమే కాకుండా ఒంటరిగా బీచ్‌లకు వెళ్లే వారిపై ప్రత్యేక నిఘాతో ప్రాణాలను కాపాడుతున్నారని కమిషనర్ తెలిపారు.

'దక్షిణం' ప్రజలకు సేవకుడిగా ఉంటా : వాసుపల్లి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో ఉన్నత స్థానం కల్పించిన ప్రజలకెప్పుడూ తాను సేవకుడి గానే ఉంటానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జివిఎంసి 35వ వార్డు ప్రసాద్ గార్డెన్స్‌లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు పూలమాలలు వేసి, హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వంలో పేదలకు విద్య, వైద్యం కార్పొరేట్ స్థాయిలో అందుతుందన్నారు. చంద్రబాబు మత్స్యకారులను ఎంతో కించపరిచారని, బిసిలకు, ఎస్‌సిలకు, మైనార్టీలకు, అట్టడుగు ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు కనకారెడ్డి, నాయకులు ఆది విష్ణు, వాసర్ల సుబ్రమణ్యం, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రసాద్ గార్డెన్స్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వాసుపల్లి

సంపత్ వినాయక హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆసీలుమెట్ట ప్రాంతంలోని సంపత్ వినాయగర్ దేవాలయం హుండీని గురువారం లెక్కించారు. 26 రోజులకు గాను రూ.111 చెక్కుతో కలిపి నగదు రూ.17,46,639 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. బంగారం 3 గ్రాములు, వెండి 176 గ్రాముల 700 మిల్లీ గ్రాములు వచ్చిందని పేర్కొన్నారు. ఇది కాకుండా ఫారిన్ కరెన్సీ కూడా వచ్చిందన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టిఆర్.చోలన్, శివజ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారులు టి.రాజగోపాల్‌రెడ్డి, దేవాలయ సిబ్బంది జి.గోవింద్‌రెడ్డి, ఇ.అప్పలరాజు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

31, 33 వార్డుల్లో వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 31, 33 వార్డుల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దక్షిణ నియోజకవర్గానికి పదేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్న గణేష్ కుమార్ ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. తాను గెలిస్తే నియోజవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. నీలమ్మ వేపచెట్టు, అల్లిపురం, వెంకటేశ్వర మెట్ట, గొల్లలపాలెం ప్రాంతాలలో చేపట్టిన ప్రచార కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, బిజెపి నాయకుడు రాజ్ కుమార్, జనసేన నాయకులు పి శివ ప్రసాద్‌రెడ్డి, కార్పొరేటర్ భీశెట్టి వసంత లక్ష్మి, కొల్లూరి రూప, ఆకుల రాజు, విల్లూరి చక్రవర్తి, తిరుమల దేవి, శరగడం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం గోతులే..!

- గాజువాక కణితి రోడ్డులో జనం కష్టాలు
- ఏడాది పొడుగునా ఏదో ఒక నిర్మాణం
- ఒక పని పూర్తవ్వకుండానే, మరో దానికి పునాది
- అవస్థలు పడుతున్న వ్యాపారులు, కొనుగోలుదారులు



గాజువాక కణితి రోడ్డులో పైపులైన్ ఏర్పాటుకు భారీగా తీస్తున్న గోతులు

ప్రజాశక్తి - గాజువాక : పారిశ్రామిక కేంద్రం గాజువాకలోని ప్రధాన వ్యాపార కేంద్రాల్లో జివిఎంసి 66వ వార్డు కణితి రోడ్డు ఒకటి. ఇటీవల కాలంలో ఈ రోడ్డులో నిత్యం ఏదో ఒక అభివృద్ధి, మరమ్మత్తు పనులను చేపడుతూ స్థానికులతోపాటు వ్యాపారులు, కొనుగోలు దారులను ఇబ్బందులకు గురిచేయడం పరిపాటిగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్కెట్‌లో, కణితిరోడ్డులో చేపట్టే పనులను యుద్ధప్రాతిపదికన కాకుండా నీలుగుతూ, నత్తనడకన చేపడుతున్నారు. ఒక్క పనైనా పూర్తిచేయకుండానే మరోపని చేపడుతూ, కష్టాలను నిత్యం కొనసాగిస్తున్నారు.దీంతో స్థానికులు, మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారులు ఆవేదన చెందుతున్నారు.

గాజువాక కణితిరోడ్డులో, ముఖ్యంగా మార్కెట్‌లో ఆరు నెలలుగా నిత్యం ఏదో ఒక పనికోసం గోతులు తవ్వే పని చేస్తూనే ఉన్నారు..మొదట రోడ్డు విస్తరణ పనుల పేరుతో సాగదీస్తూ మూడు నెల పాటు పనులు చేశారు. విస్తరణ పనులు పూర్తయిన తర్వాత ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం పేరుతో తవ్వకాలను మొదలుపెట్టి, వాటిని అసంపూర్తిగా వదిలేశారు. ఇపుడు తాజాగా వాటర్‌పైపులైన్లను మార్చే పనుల్లో భాగంగా మళ్లీ తవ్వకాలను చేపట్టి, భారీ గోతులను తీస్తున్నారు. ఇలా నిత్యం ఏదో ఒక పనిమొదలెట్టడం, దాన్ని పూర్తిచేయకుండానే అరకొరగా వదిలేసి మరో పనికి పూనుకోవడంతో స్థానిక వ్యాపారులతోపాటు మార్కెట్‌కు వచ్చేవారు రాకపోకలకు నానా అవస్థలు పాలౌతున్నారు.

ఇరుకురోడ్డులో ఇరువైపులా దుకాణాలు

ఇలా ఒకవైపు గోతులు తవ్వే పనులు చేపడుతుండగా, ఇరుకుగా అధ్వానంగా మారిన రోడ్డుపైనే దుకాణాలు వేసి వచ్చిపోయేందుకు కూడా మార్గం లేకుండా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నారు. అపుడపుడూ రోడ్డుకు ఇరుపక్కలా, రోడ్డు మధ్యల్లో వేసిన దుకాణాలను తొలగిస్తున్నా, అది మూన్నాళ్ళ ముచ్చట గానే మారి మళ్లీ రోడ్డుపైనే దుకాణాలు వెలుస్తు న్నాయి. దీనికిగాను పోలీసులు, జివిఎంసి అధికారులతో పాటు అందరికీ ముడుపులు ముడుతుండడంతో ప్రజల కష్టాలు ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలూ ఉన్నాయి.

స్థానికుల వాహనాల పార్కింగ్‌కూ అవస్థలు

సింహగిరి కాలనీ, ఇందిరా కాలనీ, సీతారాంనగర్ కాలనీ, అంబేద్కర్ కాలనీ, శివాజీనగర్ కాలనీ ప్రజలు వారి ఇళ్లల్లోకి వెళ్లలేని పరిస్థితి ఉంది. వారి ద్విచక్రవాహనాలను కణితిరోడ్ మార్కెట్ వద్ద రోడ్డుపైనే ఎక్కడికక్కడే పార్కింగ్ చేసి వెళ్లక తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. దీంతో రోడ్డుపైనే నిలిపేసిన బైక్‌ల్లోంచి రాత్రివేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్‌తోపాటు విడిభాగాలను చోరీకి పాల్పడుతున్నా రని స్థానికులు వాపోతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు కూడా రాలేని పరిస్థితి ఉందని, దీంతో రోగులను ఆసుపత్రులకు తీసుకెళ్లాలని కణితి రోడ్డులోని నివాసముంటున్న వ్యక్తి రోగిని ఆటోలో ఐదారు కి లోమీటర్లు అటూఇటుగా తిప్పి ఆసుపత్రికి తీసుకెళ్ళాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పైపులైన్లు, డ్రైనేజీలకు తీసి, పూడ్చకుండా అసంపూర్తిగా వదిలేసిన గోతుల్లో పడి చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు గాయాలపాలయ్యే స్థితి ఉందని స్థానికులు అంటున్నారు. మనుష్యులతోపాటు మూగజీవాలు కూడా ఈ భారీ గోతుల్లో పడి బయటకు రాలేని పరిస్థితి ఉండడంతో స్థానికులే వాటిని తాళ్లు, కర్రల సాయంతో బయటకు తీయాల్సిన దయనీయ పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. గడచిన ఆరునెలలుగా ఇదే పరిస్థితి ఉందని, దీంతో కొనుగోలుదారులు రాలేని స్థితిలో వ్యాపారలావాదేవీలకు ఆటంకం కలుగుతోందని కణితిరోడ్డులోని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై వాటర్ సప్లై ఎఇఇ మనోహర్‌ను వివరణ కోరగా మరోవారం రోజుల్లో పైపులైన్ పనులు పూర్తి చేస్తామన్నారు. పాతపైపులైన్లు ఎక్కడికక్కడే పాడవ్వడంతో కొత్తపైపులైన్ల ఏర్పాటుకు గోతులు తవ్వాల్సి వచ్చిందని, కొద్దిరోజులు ప్రజలు సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

146 ఒడిశా మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-పరవాడ : ఒడిశా రాష్ట్రం బరంపురం నుండి తీసుకొచ్చిన మద్యం బాటిళ్లను గురువారం పరవాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరవాడ సిఐ బాలసూర్యరావు కథనం ప్రకారం... పెందుర్తికి చెందిన లాది సుశాంత్ పాత్రో, కొత్తవలస గ్రామానికి చెందిన లేంక గౌరి శంకర్ ఇద్దరూ ఒడిశా రాష్ట్ర బరంపురం నుండి అక్రమంగా మద్యం తీసుకొచ్చి పరవాడ మండలం తానాం గ్రామంలో అమ్ముతున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు పరవాడ సిఐ బాల సూర్యారావు, తమ సిబ్బంది కలిసి దాడి చేశారు. తానాం గ్రామ శివారులో సదరు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.19,194 విలువ గల ఒడిశా రాష్ట్రానికి చెందిన 146 మద్యం బాటిళ్లను, సదరు మద్యాన్ని తరలించడానికి ఉపయోగించిన బొలెరో వాహనాన్ని స్వాధీనపర్చుకొని, సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని సిఐ బాల సూర్యారావు తెలిపారు.

2న క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వచ్చేనెల రెండో తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, తత్సమాన కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన వచ్చని, పూర్తి వివరాలకు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి గౌరీశంకర్‌ను 9441852151, 6300757771 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 31లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తామని తెలిపారు. టోర్నీలో పాల్గొనేందుకు ఎటువంటి ప్రవేశ రుసుము చెల్లించనవసరం లేదన్నారు.

వైభవంగా ముత్యమాంబ పండగ

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి వేపగుంటలో కొలువైన ముత్యమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా నిర్వహించారు ఉదయం నుండి అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలను సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు. పండుగ సందర్భంగా ఆలయం చుట్టూ విద్యుద్దీపాలంకరణ చేశారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ముత్యమాంబను . పశ్చిమ నియోజకవర్గ బిజెపి, జనసేన, టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పి. గణబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు,భక్తులు పాల్గొన్నారు

ఏడుగురు వాలంటీర్ల సస్పెన్షన్

ప్రజాశక్తి -పద్మనాభం : అధికార వైసిపి తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మండలంలోని గంధవరం పంచాయతీకి చెందిన ఏడుగురు వాలంటీర్లను సస్పెండ్ చేస్తూ స్థానిక ఎంపిడిఒ బి.శైలజ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, భీమిలి ఆర్‌డిఒ ఆదేశాల మేరకు వీరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు.

ఈ నెల 26న గంధవరంలో స్థానిక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు నిర్వహించిన ఇంటింటా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పిల్లి ముత్యాలు, సింగం శేఖర్, చిప్పాడ వెంకటలక్ష్మి, కొత్తపల్లి రమాకుమారి, కొత్తపల్లి అప్పలరాజు, తాండంగి జగదీష్, పల్లి ముత్యాల నాయుడులను ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందున విధుల నుంచి సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బుల్లయ్య కాలేజీతో సెమ్స్ ఎంఒయు



ఒప్పందపత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి- సీతమ్మధార : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్‌మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ (సిఇఎంఎస్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. బుల్లయ్య కాలేజీ సెక్రటరీ మధుకుమార్ సమక్షంలో సెమ్స్ సిఇఒ సేతు మాధవన్, సిఒఒ కమాండ్ గోపీకృష్ణ శివ్వాలతో యుజి,పిజి విభాగం ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె. చక్రవర్తి ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా బుల్లయ్య కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా పలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేస్తున్నామన్నారు అందులో భాగంగానే విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి సెమ్స్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు.

సెమ్స్ సిఇఒ సేతుమాధవన్ మాట్లాడుతూ, తమ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా విశాఖ, ముంబైలో ఉన్న తమ సంస్థ అధునాతన ల్యాబ్‌లలో మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ లాజిస్టిక్స్ తదితర ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ విద్యార్థులకు 3డీ ప్రింటింగ్, డిజైన్లు, రోబోటిక్స్ వివిధ అధునాతన సాంకేతికతలలో ఉచిత శిక్షణనిచ్చి, ఉద్యోగం, ఉపాధి కల్పించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. దీనికోసం తమ సంస్థ రూ.వంద కోట్ల పెట్టుబడులు పెట్టిందని, ఇప్పటివరకు రూ.13వేల మంది విద్యార్థులకు ఉచిత శిక్షణనిచ్చామన్నారు. రెండు వారాల నుంచి ఆరునెలల పాటు ఇచ్చే ఉచితశిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్ జారీచేస్తుందన్నారు.



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి

ధార్మిక సంస్థలు సేవల్లో ముందుండాలి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ధార్మిక సంస్థలు ప్రజలకు సేవ చేయడంలో ముందుండాలని ఎయు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు పిలుపునిచ్చారు. ఎయులో తత్త్వశాస్త్ర విభాగం, ఆచార్య సచ్చిదానందమూర్తి ధార్మిక అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'ధార్మిక విజ్ఞాన పరిణామం : పాచీన సాంప్రదాయాలపై ఆధునిక దక్పథాలు' అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు ముగిసింది. తత్త్వశాస్త్ర శాఖ విభాగాధిపతి ఆచార్య వి వెంకటరావు అధ్యక్షత వహించిన ముగింపు సమావేశంలో మాట్లాడుతూ, తరచుగా పరిశోధకులతో చర్చలు జరిపితే, విస్తృతమైన ఆలోచనా విధానం అభివృద్ధి చెందుతుందన్నారు. సదస్సు సంచాలకులు ఆచార్య వానపల్లి వెంకటరావు మాట్లాడుతూ సదస్సులో 66 మంది పరిశోధనా పత్రాలు సమర్పించారన్నారు. ఆర్ట్స్ కళాశాల వార్డెన్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గోవాడ వీర్రాజు అకాడమీ మాజీ ప్రతినిధి విమల రాజగోపాల్, విశ్వవిద్యాలయ తత్త్వశాస్త్ర విభాగాధిపతి నందిని మిశ్రా, కాకినాడ పిఆర్ కళాశాల ఉపాధ్యక్షులు కందుల ఆంజనేయులు, ఆంధ్ర విశ్వవిద్యాలయ తత్త్వశాస్త్ర ప్రొఫెసర్ ఎంవి.కృష్ణయ్య, పరిశోధకులు విద్యార్థులు వివిధ రాష్ట్రాల ఆచార్యులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్‌టియుసి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- ములగాడ : పశ్చిమ నియోజకవర్గ పారిశ్రామిక ప్రాంతంలో వైఎస్ఆర్‌టియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని యూనియన్ జిల్లా అధ్యక్షులు రాయపురెడ్డి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పివి సురేష్ పాల్గొని యూనియన్ జెండాను ఆవిష్కరించారు.కేకు కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ పివి.సురేష్ మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి, వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దాడి సత్యనారాయణ, అంగ రాంప్రసాద్, ఉద్దా భాస్కరరావు, భూపతి, రమణారెడ్డి, సుందరరావు, హనుమంతరావు, సూర్యారావు, కనకరాజు, అప్పలకొండ, రాద, వాసు, బుజ్జి, శివ, చిన్న, క్రైఫ్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో భద్రతా ప్రమాణాలను పాటించాలి

స్టీల్ సేఫ్టీ డేలో ఎంఎంఎస్ఎం విభాగాధిపతి సైబాల్‌సేన్

ప్రజాశక్తి- ఉక్కునగరం : ప్రతిఒక్కరూ భద్రతను పాటించి స్టీల్‌ప్లాంట్ ప్రగతికి సహకరించాలని ఉక్కు ఎంఎంఎస్ఎం విభాగాధిపతి సైబాల్ సేన్ పిలుపు నిచ్చారు. స్టీల్ సేఫ్టీ డే సందర్భంగా గురువారం భద్రతా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడు తూ విభాగంలోని ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పని ప్రదేశంలో భద్రతా పరికరాలు ధరించి, భద్రతా ప్రమాణాలను పాటించాలని తద్వారా ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో విభాగం అధికారులు కృష్ణప్రసాద్, పాల్, భద్రతా విభాగం అధికారి టి.ఇమ్మాన్యుయేల్, కార్మిక సంఘాల నాయకులు డి. దేముడు , కె.ఆర్‌కె రాజు, వైవి .సుబ్బారావు , ఉద్యోగులు పాల్గొన్నారు.



భద్రతా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సైబాల్‌సేన్

దివీస్ సౌజన్యంతో ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు



ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డిఎఫ్ఒ అనంత శంకర్

ప్రజాశక్తి-తగరపువలస :కంబాలకొండ వన్య ప్రాణుల అభయారణ్యం పరిధిలో ఉన్న పిఎం పాలెం నర్సరీ బయో డైవర్సిటి ప్రాంగణంలో సందర్శకుల సౌకర్యార్థం చిప్పాడ దివీస్ సంస్థ సహకారంతో రూ 9.75 లక్షలతో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాన్ని అటవీశాఖ జిల్లా అధికారి అనంతశంకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అడిగిన వెంటనే స్పందించి ఆర్ఒ ప్లాంట్ ను ఏర్పాటు చేసిన దివీ స్ యాజమన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వర రావు మాట్లాడుతూ, వివిధ రకాల మొక్కలతో ఏర్పాటుచేసిన ఆక్వాడారియం, ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటులో తమను భాగస్వామ్యం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని అభివద్ధి కార్యక్రమాలు చేసేందుకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దివీస్ లైజనింగ్ కన్సల్టెంట్ వరహాలరెడ్డి, సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్ కుమార్, ప్రతినిధులు పి శేఖర్‌బాబు, పైడినాయుడు, పలువురు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో సాధన చేస్తే విజయం తథ్యం

పౌరగ్రంథాలయ సందర్శనలో సిపి రవిశంకర్



గ్రంథాలయంలో పాఠకులతో మాట్లాడుతున్న సిపి రవిశంకర్

ప్రజాశక్తి- సీతమ్మధార : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో చదువుకోవడానికి చక్కని వాతావరణం ఉందని, విద్యార్థులు, ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అన్నారు. గురువారం పౌర గ్రంథాలయాన్నిసందర్శించారు. సెంటర్ ఫర్ పోలీస్ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సృజనాత్మక, మంచి సదుద్దేశ్యం కలిగిన వ్యక్తులతో స్థాపించబడిన పౌరగ్రంథాలయం, ఉద్యోగ, విద్యాపరమైన లక్ష్యాలను సాధించడానికి ఉపయోగకరంగా ఉందన్నారు. సివిల్స్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారంతా ఒక ప్రణాళికాయుతంగా, క్రమశిక్షణతో సాధనచేస్తే విజయం సాధించవచ్చున్నారు. పుస్తకాలు అధ్యయనం చేయాలని, దినపత్రికలు నిత్యం చదవాలని, ఆర్థిక సామాజిక విషయాలపై వచ్చే వ్యాసాలు చదివి నోట్స్ తయారు చేసుకోవాలని, ఏకాగ్రత చెడకుండా లక్ష్యంపైనే దృష్టి నిలిపి కృషి చేస్తే సునాయాసంగా విజయలక్ష్యాలను చేరుకోవచ్చని సూచించారు. అదృష్టం, దైవంపై భారం వేసినా, నమ్మిన సిద్ధాంతాన్ని క్రమశిక్షణతో ఆచరించి ముందుకు సాగాలని హితవు పలికారు. కార్యక్రమంలో గ్రంథాలయం కార్యదర్శి డిఎస్ వర్మ, సెంటర్ ఫర్ పోలీస్ స్టడీస్ ప్రతినిధి ప్రసన్నకుమార్, గ్రంథాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షకు ఐదుగురు గైర్హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : జిల్లాలో పదోతరగతి కాంపోజిట్ ప్రథమ భాష, పేపర్ -2, ఒఎస్ఎస్ మెయిన్ లాగ్వేజ్, పేపర్ -1 పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయని డిఇఒ ఎల్.చంద్రకళ తెలిపారు. 120 పరీక్ష కేంద్రాల్లో 5,688 మంది విద్యార్థులకుగాను 5,683 విద్యార్థులు హాజరయ్యారని, . ఐదుగురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. డిఇఒ ఎల్.చంద్రకళ రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా, స్క్వాడ్ బృందాలు 33 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డిఇఒ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నూతన వేతనాల అమలుకు ఆందోళన తీవ్రతరం

- స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి రామస్వామి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులకు వేతనాలు చెల్లింపులో యాజమాన్యం వైఖరి అత్యంత దుర్మార్గమని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి విమర్శించారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో సక్రమంగా వేతనాలు చెల్లింపు కష్టమేనని, జిందాల్‌కు అప్పగిస్తే ఉత్పత్తి పెరిగి, వచ్చిన లాభాలతో వేతనాలను పెంచి చెల్లించేందుకు ఆస్కారముంటుందని మభ్యపెట్టే చర్యలు మానుకోవాలని హితవు పలికారు. సంపద సమకూరితే కార్మికులకు నూతన వేతనాలు అమలు చేస్తామని బూటకపు మాటలు మానుకోవాలన్నారు. సకాలంలో, సక్రమంగా వేతనాలు చెల్లించకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

గురువారం స్టీల్‌ప్లాంట్ సిఎంఎస్ వద్ద నిర్వహించిన స్టీల్ సిఐటియు ఆఫీస్ బేరర్స్ సమావేశంలో రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు వస్తున్న ముడిసరుకుతో మెరుగైన ఉత్పత్తి సాధనకు కార్మికులు కృషి చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్. ఉన్నత యాజమాన్యం పూర్తిస్థాయి ఉత్పత్తి, ఉత్పాదకతలపై దృష్టి సారించకుండా కార్మికులను భయాందోళన, గందరగోళానికి గురిచేసే వైఖరిని మానుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పదని హెచ్చరించారు. స్టీల్ సిఐటియు వర్కింగ్ ప్రెసిడెంట్ పి శ్రీనివాసరాజు మాట్లాడుతూ సిహెచ్‌సిల నిర్వహణలో అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, నాయకులు బి అప్పారావు, పుల్లారావు, నీలకంఠం, కష్ణమూర్తి, సత్యనారాయణ, మొహిద్దీన్, రమేష్, రమణ, కె ఆర్ కె రాజు, వి ప్రసాద్, శ్రీనివాస్, వి డి వి పూర్ణచంద్రరావు, అరుణ్, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఉత్తర' వైసిపి కార్యాలయం ప్రారంభం



నేతలను గజమాలతో సత్కరిస్తున్న వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి- సీతమ్మధార : బాలయ్యశాస్త్రి లేఅవుట్ వద్ద ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైసిపి కార్యాలయాన్ని ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవి.సుబ్బారెడ్డి జ్యోతిప్రజ్వళన చేసి అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో సర్వమత ప్రార్థనలు, పూజలు, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, పార్టీ కార్యాలయం ప్రారంభానికి పెద్దఎత్తున నేతలు, కార్యకర్తలు తరలి రావడం అభినందనీయమన్నారు. పదవి లేకపోయినా నిత్యం ప్రజల మధ్యే ఉంటూ, వారి బాగోగులు చూసుకున్న కెకె.రాజును ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా, ఆలాగే విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులు అందరూ సమన్వ యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎంపి అభ్యర్థిని బొత్స ఝాన్సీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షులు కోల గురువులు.ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు రెహమాన్, తైనాల విజయ్ కుమార్, చింతలపూడి వేంకటరామయ్య, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు మారిటైమ్ బోర్డు ఛైర్మన్ కాయల వెంకటరెడ్డి, రవి రాజు, జహీర్ అహ్మద్, ఫారుఖీ, కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థుల విజయానికి కృషిచేస్తా

రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థుల విజయానికి తనవంతు కృషి చేస్తానని వైసిపి మాజీ జిల్లా సమన్వయకర్త జివి.రవిరాజు అన్నారు. గురువారం ఉత్తర పార్టీ కార్యాలయంలో కెకెరాజుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ, వ్యక్తిగత కారణాలతో 2014 ఎన్నికల తర్వాత రాజకీయాలకు దూరంగా ఉన్న తాను ఇటీవల తాడేపల్లిలో సిఎం జగన్‌ను కలిశానన్నారు. ఆయన ఆదేశాల మేరకు ఉత్తర ఎమ్మెల్యేగా కెకె.రాజు, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీ విజయానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోల గురువులు, బొగ్గు శ్రీను, పేడాడ రమణికుమారి, అనూష పట్నాయక్, కెవి బాబా పాల్గొన్నారు

తర్లువాడ, పాలవలసలో ముమ్మర ప్రచారం



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఝాన్సీ, పక్కనే ముత్తంశెట్టి

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని తర్లువాడ, పాలవలస గ్రామాలలో గురువారం వైసిపి ఎంపి అభ్యర్థి బొత్స ఝాన్సీ, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేస్తూ, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు ఎన్నికల ప్రచారంలో భాగంగా తర్లువాడలో ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక, మజ్జి వెంకటరావు, తర్లవాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, పాలవలసలో ఎంపిటిసి రైతు శ్యామల వెంకటరావు స్థానిక నేతలు ఏర్పాటుచేసిన మహిళల మేళం, కోలాటం ఆకట్టుకున్నాయి.

బొత్సఝాన్సీ, ముత్తంశెట్టిలను గజమాలతో సత్కరించారు. ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు వైస్ ఎంపిపి పాండ్రాంకి శ్రీను, బంటుబిల్లి మణిశంకర్ నాయుడు, పాంద్రంకి అప్పారావు, పినిశెట్టి సింహాచలం నాయుడు, ఇల్లాపు వెంకటజగన్, ఇల్లిపిల్లి నరసింగరావు, రౌతు శ్రీను నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా వైసిపి ఎన్నికల ప్రచారం



కరాసలో ప్రచార ర్యాలీలో పాల్గొన్న ఝాన్సీ, ఆనందకుమార్

ప్రజాశక్తి -కరాస: జివిఎంసి 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వార్డు అధ్యక్షులు జియ్యని మారుతి ఆధ్వర్యంలో వైసిపి విశాఖ ఎంపీ బొత్స ఝాన్సీ, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు అనంతరం కరాస నుండి గౌరీనగర్ వరకు ప్రచారర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి శ్రేణులు పూలు, బత్తాయిపళ్లతో తయారుచేసిన గజమాలతో స్వాగతించి, సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పరిశీలకులు ఎస్ఏ రెహమాన్, ,కో అబ్జర్వర్లు పేడాడ రమణకుమారి, పీల ఉమారాణి పాల్గొని ఇంటింటా కరపత్రాలు పంచుతూ మళ్లీ జగన్‌ను సిఎం చేయాలని కోరారు.

కాపు నేతలతో ఆడారి సమావేశం

గోపాలపట్నం : గోపాలపట్నంలో కాపు సంఘం నేతలతో గురువారం వైసిపి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సమావేశమయ్యారు. కాపుల సంక్షేమానికి వైసిపి కట్టుబడి ఉందని అందుకే జిల్లాలో ఐదు సీట్లు కేటాయించిందన్నారు. రూ.రెండు కోట్లతో కాపు భవనాన్ని మంజూరు చేసిందన్నారు. కాపులు ఆదరించి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, మాజీ కార్పొరేటర్ పీలా ఉమారాణి, గోపాలపట్నం కాపు సంఘం అధ్యక్షులు కంచిపాటి చంటి పాల్గొన్నారు

ఆడారి మద్దతుగా సోదరి ప్రచారం

ములగాడ: జివిఎంసి 58వ వార్డులో శ్రీరామనగర్, కుంచాలమ్మ కాలనీ, శాంతినగర్ ప్రాంతాల్లో వైసిపి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి



ఇంటింటా ప్రచారంలో పీలా రమాకుమారి

ఆనందకుమార్‌కు మద్దతుగా ఆయన సోదరి, ఎలమంచిలి మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పీలా రమాకుమారి గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహిం చారు. ఎమ్మెల్యేగా ఆనంద్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులివిందల లావణ్య, వార్డు వైసిపి అధ్యక్షులు దాట్ల శ్రీనివాస రాజు, గులివెందుల కష్ణారావు జి.సత్యనారాయణరెడ్డి, జి.చిన సత్యనారాయణ రెడ్డి, చెరుకూరి ముకుందరావు, పిలక వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చుక్కా వరలక్ష్మి, తోనంగి వెంకటరమణమ్మ, బర్రి సంతోష్, పిట్టా అప్పలరెడ్డి, జింక్ ఆంజనేయస్వామి దేవస్థానం ఛైర్మన్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మద్యం, మాదక ద్రవ్యాలపై కట్టుదిట్టమైన చర్యలు

జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో మద్యం, మాదక ద్రవ్యాల సరఫరాపై కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి తెలిపారు. తాడేపల్లి నుండి ఈ విషయమై గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనకాపల్లి నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టరు మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాను పూర్తిగా అరికట్టేందుకు జిల్లాలో తాటిపర్తి, ఎ.ఎల్.పురం, కోనాం, గొలుగొండల వద్ద నాలుగు చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు నిరంతం నిఘా వుంటుందన్నారు. జిల్లా ఎస్పి కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ మదకద్రవ్యాల ఉత్పత్తి, నివారణకు పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికార్లు ప్రణాళికాయుతంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రోడ్డు మార్గాలనే కాకుండా నడక మార్గాలలో కూడా నిఘా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అక్రమ మద్యం, గంజాయి సాగు, ఇతర మత్తు పదార్ధాల రవాణా, విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో గంజాయి సాగుచేసే గిరిజనులకు ఆపరేషన్ పరివర్తన కింద గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటల సాగుకు ప్రోత్సంహించాలని కోరారు. ఈ సమావేశంలో అనకాపల్లి నుండి అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, ఎక్సైజ్ శాఖ అధికార్లు పాల్గొన్నారు.



ఎపిఇపిడిసిఎల్ ఇఇ రామకృష్ణను సత్కరిస్తున్న కాలేజీ యాజమాన్యం

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి

విద్యార్థులు క్రమశిక్షణ అంకిత భావంతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ అన్నారు. స్థానిక రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం కళాశాల ప్రధానాచార్యులు ఐవిఎస్ఎస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. ప్రధాన ఆచార్యులు ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు మంచి ప్లేస్మెంట్స్ రావడం గర్వకారణమన్నారు. అనంతరం వివిధ క్రీడలలో విజేతలైన విద్యార్థులకు ముఖ్యఅతిథి రామకృష్ణ, ప్రధానాచార్యులు శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖధిపతులు, పరిపాలన అధికారి, విద్యార్థి సలహాదారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజాం వే బ్రిడ్జి సమీపంలో ధ్వంసమైన రోడ్డు

భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

కసింకోట- బంగారమెట్ట రోడ్లో రాజాం జంక్షన్, వే బ్రిడ్జ్ సమీపంలో అధిక లోడుతో వెళ్తున్న గ్రానైట్ వాహనం నుండి గ్రానైట్ బండ పడిపోవడంతో రోడ్డు ధ్వంసమైంది. ఇటీవలే కసింకోట -బంగారంమెట్ట రోడ్డును పునర్నిర్మాణం చేశారు. నియోజకవర్గంలో పలు రోడ్లు తీవ్రంగా ధ్వంసం కావడంతో, ఈ రోడ్డు గుండానే అనకాపల్లి జిల్లా కేంద్రానికి, విశాఖపట్నం వెళ్లే వాహనదారులు అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. ఇటీవల పూర్తయిన ఈ రోడ్డుపైనే భారీ వాహనాలు రాకపోకల వల్ల రోడ్డు ధ్వసం కావడం పట్ల ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

బహిరంగ సభకు తరలిరండి


ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి పార్లమెంట్ తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి సీఎం రమేష్ శుక్రవారం అనకాపల్లికి విచ్చేయుచున్న నేపథ్యంలో జేఎంజి స్కూల్ ఎదురుగా ఉన్న స్థలంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ మూడు పార్టీల శ్రేణులకు టిడిపి, జనసేన, బిజెపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు, పంచకర్ల రమేష్ బాబు, ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు పిలుపునిచ్చారు.

బూడికి పలువురు అభినందనలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

అనకాపల్లి పార్లమెంట్ వైసిపి అభ్యర్థిగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును ఆ పార్టీ అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో ఆయనకు పెందుర్తి శాసన సభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్‌తో పాటు పలువురు నాయకులు మద్దతు తెలియజేసి, అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు మండలంలోని తారువ వచ్చి బూడిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పట్ల పరిపూర్ణ అవహగానా కలిగిన వ్యక్తి ముత్యాలనాయుడు అని, కూటమి అభ్యర్థి సియం రమేష్ గతమంతా అవినీతి మాయానని, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తి కాదని పేర్కొన్నారు. ముత్యాలనాయుడుకి, రమేష్‌కి చాలా వ్యత్యాసం ఉందన్నారు. కార్యక్రమంలో పరవాడ జడ్పిటిసి పిఎస్ రాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శివాజీ, నర్సీపట్నం సీనియర్ నాయకులు బోళేం నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బూడి ముత్యాలనాయుడును అభినందిస్తున్న అదీప్‌రాజ్ తదితరులు

మాక్ కౌంటింగ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, పోలీసు సూపరింటెండింట్ కెవి.మురళీకృష్ణతో కలసి గురువారం అనకాపల్లి ఎస్‌పి కార్యాలయం వద్ద గల కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అక్కడ జరుగుతున్న మాక్ కౌంటింగ్ డ్రిల్‌ను పరిశీలించారు. కౌంటింగ్ ఏర్పాట్లు, నిర్వహణపై అధికారులతో మాట్లాడారు. చిన్న తప్పునకు కూడా అవకాశం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎమ్.జాహ్నవి, ఆర్డీవో చిన్నికృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాక్ కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, జెసి

టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో సమావేశం



మాట్లాడుతున్న టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధి 84వ వార్డు గొల్లవీధిలో టీడీపీ- జనసేన-బీజేపీ శ్రేణులతో కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం గురువారం మాజీ శాసనసభ్యులు గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలబాబు అధ్యక్షతన జరిగింది. పాత 12, 13, 14 మున్సిపల్ వార్డుల్లో మూడు పార్టీల శ్రేణులతో జరిగిన ఈ ఆత్మీయ సమావేశంలో ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గాజు గ్లాసు, కమలం పువ్వు గుర్తులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కూటమి విజయం రాష్ట్రాభివృద్ధికి చారిత్రిక అవసరమని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొణతాల వెంకటరావు, డాక్టర్ కేకేవిఏ నారాయణరావు, కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, మాజీ కౌన్సిలర్లు కుప్పిలి జగన్, మడగల శ్రీను, సిరసపల్లి ఆదిబాబు, కొణతాల రత్నకుమారి, రేబాక ఈశ్వర అప్పారావు, పిళ్ళా తారకేశ్వరరావు, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి శ్రేణులతో పైలా సమావేశం

దేవరాపల్లి : మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో మాడుగుల నియోజకవర్గం టిడిపి జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వ్యవస్థలో, విధానాల్లో మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల ఆదరణ చూస్తుంటే రానున్న ఎన్నికల్లో విజయం ఖాయమని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. జగన్ పాలనలో ఏపీ ప్రజలు చాలా కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని జగన్ అప్పులు పాలు చేశాడని, ఒకటో తారీఖు నాటికి ఎవరికీ జీతాలు అందడం లేదని పేర్కొన్నారు. పేదవాడి కడుపు నింపే అన్న క్యాంటీన్లు అధికారంలోకి వచ్చిన తరువాత తిరిగి తెరుస్తామన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు వేచలపు ఈశ్వరరావు, వేచలపు రామునాయుడు, కోటాన రమేష్, గుల్లిపల్లి జోగినాయుడు, లాలం కన్నం నాయుడు, గర్రెడ్డి సత్తిబాబు, వేచలపు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఎన్నికల గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వారి కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలననుసరించి జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యయ నిర్ధారణ నోడల్ అధికారి, గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి టీమ్‌ల వారిచే సీజ్ చేయబడిన ఏ పార్టీకి చెందని, ప్రజలు తమ అవసర నిమిత్తం తీసుకు వెళ్తున్న నగదు, వస్తువులు, తగిన ఆధారాలతో ఎఫ్ఐఆర్ నమోదు కాబడని కేసులు మాత్రమే ఈ కమిటీ విచారణ చేస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని తమ అవసర నిమిత్తం ముఖ్యమైన వాటినే తీసుకువెళ్లాలని కోరారు. పట్టుబడిన సొమ్ము, వస్తువులపై తగిన ఆధారాలు చూపించి టీమ్‌ల వారిచే స్టేట్ మెంట్ చేయించుకోవాలన్నారు. పిదప జిల్లా గ్రీవెన్స్ కమిటీని సంప్రదించాలన్నారు. పై విషయాన్ని ప్రజలందరూ గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా వ్యయ నిర్ధారణ నోడల్ అధికారి, గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ (ఫోన్ నెంబర్ 92901 29847) కోరారు.

మాజీ ఎంపీపీకి కొణతాల పరామర్శ

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి మాజీ ఎంపీపీ, సూర్యనారాయణ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల బాబురావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయనను గురువారం మాజీ మంత్రి , అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీల గోవింద సత్యనారాయణ పరామర్శించారు. బాబురావు ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని, అతి త్వరలోనే కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణరావు, కొణతాల సత్యనారాయణ, పైసా మాస్టర్ , మాజీ కౌన్సిలర్ పీల నాగ శ్రీను, పిఎస్ అప్పారావు, పివి రమణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థి భరత్ కుమార్ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి

జీవీఎంసీ అనకాపల్లి జోన్ 84వ వార్డు పరిధి కోట్ని వీధిలో ఆ వార్డు వైసిపి ఇంచార్జ్ కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో గురువారం అనకాపల్లి నియోజకవర్గం వైసిపి అభ్యర్థి మలసాల భరత్ కుమార్ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భరత్ కుమార్‌కు మహిళలు పూల వర్షంతో, అడుగడుగునా హారతులు ఇచ్చి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ కోట్ని వీధి ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలకు అందుబాటులో ఉండే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపిస్తే అనకాపల్లి నియోజవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, అప్పికొండ రవిశంకర్, కోరుకొండ అప్పలసూరి, కోరుకొండ మునిస్వామి, గాడి మాదురి నాయుడు, పలక సత్యనారాయణ, సేనపతి సాయి, జెట్టి వాసు, మమ్మిడి లక్ష్మీపతి, టి.ఈశ్వరరావు, కొణతాల సత్తిబాబు, కొట్ని శ్రీనివాస్, పిల్లల శివ అప్పారావు, బాబు హరినాథ్ పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు అందిస్తున్న భరత్ కుమార్

బాల్య వివాహాలు చేస్తే కేసులు నమోదు



మాట్లాడుతున్న తహశీల్దారు లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-దేవరాపల్లి

బాల్య వివాహాలు చేసుకోవడమే కాకుండా, మైనర్ బాలికతో సంసారం చేసిన వారు కూడా శిక్షార్హులని తహశీల్దారు లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు లక్ష్మీనారాయణ, వైద్యాధికారి పూజ మేఘన, ఐసిడిఎస్ పిఓ మంగతాయారు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి డి.లోవరాజు మాట్లాడుతూ 18 సంవత్సరాలు లోపు ఉన్న బాలికలను వివాహం చేసుకొని సంసారం చేస్తే పెళ్లి చేసుకున్న అబ్బాయి తల్లిదండ్రులు, బాలిక తల్లిదండ్రులు, పెళ్లి పెద్దలపై అత్యాచారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. బాల్యవివాహాలు నిర్వహించిన, ప్రోత్సహించిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ విషయాలపై అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజలకు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న అమ్మాయికి, 21 సంవత్సరంలోపు ఉన్న అబ్బాయికి వివాహం చేస్తే బాల్య వివాహం నిషేధ చట్టం 2006 ప్రకారం శిక్ష అర్హులని పేర్కొన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ నిర్వహించిన వెంటనే ఐసిడిఎస్ అధికారులకు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పర్యవేక్షణ అధికారి వివి రమణ, ఏపీఎం ప్రభాకర్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, వెలుగు సీసీలు, అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



టైమ్‌లైన్ గురించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టైమ్‌లైన్‌పై రైతులకు అవగాహన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

శ్రీకాకుళం ఎచ్చెర్ల కింజరపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని పి.భీమవరంలో గురువారం రైతులకు టైం లైన్‌పై అవగాహన కల్పించారు. రైతులు కాలానికి అనుగుణంగా సాగు చేసి పెట్టినట్లయితే అధిక దిగుబడులను, తక్కువ ఖర్చుతో సాధించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పినపోలు రామనాయుడు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజ్ కుమార్, కిషోర్ కుమార్, విద్యార్థులు శశికళ, పూజిత, శ్రావణి, పల్లవి, లిఖిత, షారోన్, తేజస్విని, ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న సర్పంచ్ ఎరుకునాయుడు తదితరులు

వైభవంగా అమ్మవార్ల ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలం చౌడువాడ గ్రామంలో మరిడిమాంబ, బంగారమ్మ అమ్మవార్ల ఆలయం ద్వితీయ వార్షికోత్సవం గురువారం ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండే ఆలయం వద్ద భక్తులు పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు 1/2 కేజీ వెండి హారాన్ని మునగపాక ఎంపీపీ మళ్ల జయమ్మ బహూకరించారు. మధ్యాహ్నం ఆలయం ఆవరణలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ దాడి ఎరుకనాయుడు, శిల్పరశెట్టి వెంకటరావు సారధ్యంలో ఎడ్ల పరుగు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మాడుగుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పైలా ప్రసాదరావు అమ్మవారికి పూజలు జరిపి ఎడ్ల పరుగు ప్రదర్శనలో పాల్గొన్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శిల్పరిశెట్టి ముసలి నాయుడు, మళ్ల సూరిబాబు, మళ్ల వెంకటరమణ, రాపేటి రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ప్రజాశక్తి -కశింకోట

రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కశింకోట సిఐ వినోద్‌బాబు అన్నారు. మండలంలోని ఉగ్గినిపాలెం గ్రామంలో ఎన్నికలపై గ్రామస్తులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సందర్భంగా ఎటువంటి ఘర్షణలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఉగ్గినపాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ వినోద్‌బాబు

సార్వత్రిక ఎన్నికల బహిష్కరణపై

తాడి గ్రామసభ తీర్మానం కాపీ కలెక్టర్‌కు అందజేత

ప్రజాశక్తి - పరవాడ



డిఆర్ఒకు తీర్మాన కాపీ అందజేస్తున్న తాడి గ్రామ పెద్దలు

రాంకీ ఫార్మాసిటీ కాలుష్య కోరల్లో చిక్కుకున్న పరవాడ మండలం తాడి గ్రామాన్ని తక్షణమే తరలించాలని, లేకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని బుధవారం జరిగిన గ్రామసభ చేసిన తీర్మాన కాపీని గ్రామ నాయకులు గురువారం కలెక్టర్‌కు, అనకాపల్లి ఆర్‌డిఒకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫార్మా కాలుష్యంతో తాము అల్లాడిపోతున్నామని, మూడు ప్రభుత్వాలు మారినా తమ సమస్యలను పట్టించుకోలేదని వాపోయారు. ఈ నేపథ్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు గ్రామస్తులందరూ అన్ని పార్టీల తరపున తీర్మానం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, గుమ్మాల రాము, ఎస్ రమణ, కే.కులదీప్ రాజ్, ఎం సూరిబాబు, ఎస్ రాజు, కే.అచ్చి బాబు, కే సూరిబాబు, ఎస్ రాజు, పైడిరాజు, ఎన్ పరమటయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక



విజయ్‌కుమార్ సమక్షంలో జనసేనలో చేరిన మడకపాలెం గ్రామస్తులు

ప్రజాశక్తి -మునగపాక


మండలంలోని మడకపాలెం గ్రామంలో పలువురు గురువారం జనసేన పార్టీలో చేరారు. వీరికి ఎలమంచిలి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయకుమార్ జనసేన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించడం లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు టెక్కలి పరశురాం, ఏవి సత్యనారాయణ, కాళ్ళ చంద్రమోహన్, ముల్లేటి ఆనంద్, అల్లవరపు రమణబాబు, మాజీ సర్పంచ్ బాబ్జి, ఆడారి శ్రీకాంత్, వీర మహిళలు సరోజినీ, సరస్వతి, మండల జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో యువకుల చేరిక

కశింకోట : మండలంలో నర్సింగబిల్లి, చింతలపాలెం గ్రామాలలో టీడీపీ -బీజేపీ- జనసేన పార్టీల కార్యకర్తలతో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు జనసేన పార్టీలో చేరారు. వారికి కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జనసేన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన-బీజేపీ పార్టీల కూటమి అధికారంలోకి రాగానే యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, కాయల మురళి, ఎంపిటీసీ షేక్ దర్గా, వేగి గోపీకృష్ణ, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, కాండ్రేగులు , సతీష్ , మజ్జి నిరంజన్ కుమార్, మజ్జి సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన మాజీ ఉప సర్పంచ్

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పెద్దాడ నూకరాజు వైసిపిని వీడి గురువారం ఆ గ్రామ మాజీ ఎంపిటీసీ పెద్దాడ వెంకటరమణ ఆధ్వర్యాన టిడిపిలో చేశారు. ఆయనకు మాడుగుల నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు పసుపు కండువా వేసుకొని పార్టీలోకి ఆహ్వానించారు.



పైలా ప్రసాదరావు సమక్షంలో టిడిపిలో చేరిన నూకరాజు



ముత్యమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ముత్యమాంబ అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని అంతకాపల్లి గ్రామదేవత ముత్యమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అమ్మవారిని గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ దంపతులకు సాదర స్వాగతం పలికారు. సర్పంచ్ సబ్బవరపు నారాయణ మూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ ఎమ్మెల్యే దంపతులకు దుశ్శాలువ కప్పి మెమోంటో బహుకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నేతలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు రేషన్ పంపిణీ


ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని వేచలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి బి.హారిక ఆధ్వర్యంలో గురువారం ఇద్దరు కుష్టు వ్యాధిగ్రస్తులకు రేషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైద్యాధికారుల సూచనలు సలహాలు పాటించాలన్నారు. అత్యవసరమైతే వెంటనే పీహెచ్సీకి వచ్చి తగు వైద్య చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శంకర్రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులకు రత్నాకర్ పూజలు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణంలోని చిన నాల్గురోడ్ల జంక్షన్ వద్ద ఉన్న కుంచావారి గౌరీ పరమేశ్వరుల పంచలోహ ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా గురువారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు రత్నాకర్‌ని సాదరంగా ఆహ్వానించి శాలువాతో ఘనంగా సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు పాండ్రంగి సత్యరావు, పెద్దలు పాల్గొన్నారు.



గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న రత్నాకర్

ఓటు హక్కును వినియోగించుకోవాలి

-పలు చోట్ల అవగాహనా ర్యాలీలు, మానవహారాలు



రావికమతంలో ర్యాలీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్: ఆర్డీవో ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలో ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ, అవగాహన సదస్సును నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై నినాదాలు చేస్తూ రావికమతం నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భానోజీరావు, తహసిల్దారు రమణారావులు మాట్లాడుతూ, ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఓటు హక్కుతో మంచి నాయకున్ని ఎన్నుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఓటు హక్కు వినియోగం, ఎన్నికల ప్రవర్తన నియమావళి, నిబంధనలు, తాజా ఎన్నికల ప్రక్రియలో అమల్లోకి వచ్చిన పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఎన్నికల కోడ్ నిబంధనలు పాటిస్తూ మండలంలో ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం తిలక్, మండల సర్వేయర్, బిఎల్‌వోలు, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

రోలుగుంట:ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణ ఆదేశాల మేరకు మండల తహశీల్దార్ రవిచంద్ర ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో మెయిన్ రోడ్డు మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు మన హక్కు అని. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, రూట్ ఆఫీసర్స్, సెక్షన్ ఆఫీసర్లు, డిప్యూటీ తహశీల్దార్ సోమశేఖర్, సీనియర్ అసిస్టెంట్ పంచదార్ల నరసింగరావు, ఆర్ఐ రామ్మూర్తి, పంచాయతీ కార్యదరర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.


రోలుగుంటలో మానవహారం

కోటవురట్ల:మండల కేంద్రంలో గురువారం ఓటు హక్కు వినియోగంపై సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగదారులు సమస్యలు ఉంటే 1950 తెలియజేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

చోడవరం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను చైతన్యం చేయడానికి రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తాసిల్దార్ కార్యాలయం నుండి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించి కొత్తూరు జంక్షన్లో మానవహారం చేశారు. ఎన్నికల్లో ఓటర్లు చైతన్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తాసిల్దార్ వేణుగోపాల్ కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ బి శ్రీనివాసరావు , బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



చోడవరంలో చేపడుతున్న ర్యాలీ



కవాతు చేస్తున్న పోలీసులు

పోలీసుల కవాతు

ప్రజాశక్తి-నక్కపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా గ్రామాల్లో పోలీసుల కవాతు నిర్వహిస్తున్నట్లు సిఐ విజయ్ కుమార్ తెలిపారు. మండలంలోని నక్కపల్లి, ఉపమాక, సారిపల్లి పాలెం, చినదొడ్డిగల్లు, సీతంపాలెం గ్రామాల్లో సిఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర, స్థానిక పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ, ఓటర్లు భయభ్రాంతులకు లోను కాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. స్వేచ్ఛాయుత వాతావ రణంలో ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.


ఫిర్యాదు పత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

ఆర్‌డిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ :ఎన్నికల కోడ్‌ను విస్మరించి అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తున్న ఐకేపీ సీసీ పై గొలుగొండ మండలం సీహెచ్.ఎర్రవరం గ్రామానికి చెందిన అమరపల్లి నాగేశ్వరరావు గురువారం నర్సీపట్నంలో రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జయరాంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఈ నెల 27న బుధవారం సుమారు 3 గంటల ప్రాంతంలో గొలుగొండ ఇందిరా క్రాతి పథం సీసీ సర్వసిద్ధి శ్రీరామ్మూర్తి అతని అనుచరులైన పట్నాల సత్తిబాబు, పట్నాల గోపి, పట్నాల సన్నీబాబు, బర్ల రమణ తదితరులు తమ ఇంటిపైకి వచ్చి దాడి చేశారన్నారు. కర్రలు, మారణాయుధాలతో దాడి చేశారన్నారు. తాను వీడియో తీస్తుండగా సర్వసిద్ధి శ్రీరామ్మూర్తి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.


కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి - చీడికాడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. మండలంలోని కోనాం పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్పోస్ట్ వద్ద భద్రతను పెంచారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ధనరాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను నిశితంగా తనిఖీలు చేస్తున్నారు.

ఎర్రవరంలో ఉద్రిక్తత

- టిడిపి, వైసిపి నేతల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలంలోని ఎర్రవరంలో తెలుగుదేశం పార్టీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్ల దాడులకు పూనుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఎర్రవరం పంచాయతీ గొల్లపేట రామాలయం వీధిలో మంగళవారం గంగాదేవి పండుగను నిర్వహించారు. ఈ వేడుకకు ఎర్రవరంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన యువకులు విచ్చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుండగా బయట నుంచి విచ్చేసిన యువకులకు, ఎర్రవరం గ్రామానికి చెందిన యువకులకు స్వల్ప వివాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనను ఎర్రవరంలోని టీడీపీకి చెందిన అమరపల్లి నాగేశ్వరరావు ఫోన్ ద్వారా వీడియో తీస్తుండగా ఎర్రవరానికి చెందిన వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. దీంతో స్థానికులు కలుగజేసుకొని వివాదం సర్దుమణిగేందుకు ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అరమపల్లి నాగేశ్వరరావు ఇంటిపైకి అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా రాళ్లతో చేశారు. సాయంత్రం ఇరువర్గాల వారు ఇందుకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నట్టు గొలుగొండ ఎస్సై కృష్ణారావు విలేకరులకు తెలిపారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:

గిరిజన హక్కులు, చట్టాల రక్షణకై నిరంతరం పోరాటం చేస్తున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. గురువారం మండలంలోని గన్నెల పంచాయితీ మారుమూల గ్రామాలైన చిడివలస, సభక, కెంటిబడి గ్రామలలో సిపిఎం నాయకులు పర్యటించారు. అరకు సిపిఎం అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, నాయకులు పాంగి రామన్న మాట్లాడుతూ, నిరంతరం ప్రజల పక్షాన ఉండి గిరిజన హక్కుల చట్టాలు కోసం పోరాడే సిపిఎం బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి చట్టసభలకు పంపించాలని కోరారు. అటవీ సంపదను కాపాడాలంటే సిపిఎం అభ్యర్థులను చట్టసభలకు పంపించాలని కోరారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమిలను ఓడించాలని పిలుపునిచ్చారు. .జిఓ 3 రద్దు చేయడంతో గిరిజన ప్రాంత యువతీ యువకులు తీవ్రంగా అన్యాయమై పోయారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.గాసి అప్పలస్వామి, ఎస్ రాజారావు, ఎస్ సీతన్న, ఎస్.అప్పలరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

పథకాలపై టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో గురువారం తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పట్టణ అధ్యక్షులు అడ్డూరి లోవరాజు ఆధ్వర్యంలో బాబు షూరీటి - భవిష్యత్తు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీసాల ఉమామహేశ్వరరావు, అల్లాడ తాతారావు, అడ్డూరి శీను, పెద్దరెడ్డి రమేష్, చిన్న, లోవరాజు, పచ్చిపులుసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలి

ప్రజాశక్తి -పాడేరు:రానున్న ఎన్నికలకు కేటాయించిన ఎన్నికల సిబ్బందికి ప్రతి అంశంపైనా శిక్షణ ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత మాస్టర్ ట్రెయినీలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, అన్నీ తెలుసుననే భావం ఎవ్వరికీ ఉండకూడదని, ప్రతి చిన్న విషయాన్ని సీరియస్ గా తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ నుండి వచ్చే సూచనలు, నిభందనలు, మార్పులు, చేర్పులు గమనిస్తూ వాటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. శిక్షణలు ఎప్పటికప్పుడు నవీకరణకు తోడ్పడతాయని తెలిపారు. సమాచారం చేరవేయడంలో అలసత్వం, జాప్యం ఉండరాదన్నారు. ఇవిఎంల వినియోగంలో చిన్న పొరపాటు కూడా జరగరాదని, ఉంటే వాటిని సరిదిద్దుకునే అంశాలను ఎన్నికల సిబ్బందికి అర్థం అయ్యే రీతిలో తగు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి చిన్న విషయం అట్టడుగు క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు చేరే విధంగా శిక్షణ ఉండాలన్నారు. ఓటింగ్ పూర్తైన తరువాత నాలుగు రకాల సీల్స్ వేయాలని, ఓటింగ్ లో పాల్గొన్న ఓటర్ల సంఖ్య మెషిన్‌పై చూపించిన నంబరు, పిఒ డైరీలో నంబర్, ఓటింగ్ స్లిప్పులు తదితర ఐదు రకాల నంబర్లు ఒకేలా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో పాడేరు, అరకు అసెంబ్లీ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు భావన వశిష్ట్, వి.అభిషేక్, డిఆర్ఓ బి.పద్మావతి, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీలు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అల్లూరి జిల్లా కలెక్టర్ విజయసునీత

గొలుగొండలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : గొలుగొండ మండల కేంద్రంలో చలివేంద్రాన్ని ఎంపీడీఓ రత్నకుమారి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రోజారమణి, పంచాయతీ కార్యదర్శి రఘు, రమణ, ఎఓ సత్యనారాయణ , గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపిడిఓ రత్నకుమారి

కలెక్టర్, ఎస్‌పిల ఆకస్మిక పర్యటన

- పోలింగ్ కేంద్రాల పరిశీలన- ఎన్నికల ఏర్పాట్లపై అధికారులకు సూచనలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణలు గొలుగొండ మండలంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ముందుగా ఏజెన్సీ లక్ష్మీపురం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ స్టేషన్‌లను సందర్శించారు. మౌలిక వసతులు, భద్రత ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గొలుగొండ మండలం ఎర్రన్నపాలెం పోలీస్ చెక్ పోస్ట్‌ను, కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఏజెన్సీ లక్ష్మీపురం పోలీస్ చెక్ పోస్టులను, గొలుగొండ గ్రామం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ ను తనిఖీలు నిర్వహించారు. అప్రమత్తంగా ఉండాలని, వాహన తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. మద్యం, నాటు సారా, గంజాయి అక్రమ రవాణా అరికట్టాలని, నగదు, బంగారం, వెండి ఇతర విలువైన లోహాలు, ఉచిత కానుకలు పంపిణీ చేసే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీరి వెంట కేడీపేట ఎస్సై ఉపేంద్ర, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం మండలం గబ్బడ ఎంపీయూపీ స్కూల్ పోలింగ్ స్టేషన్ ను జిల్లా కలెక్టర్ రవిపట్టన్ శెట్టి, జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ గురువారం సందర్శించారు. మౌలిక వసతులు, భద్రత ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం పాల్గొన్నారు.



నర్సీపట్నంలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ



జల్లూరు వద్ద ఉంచిన కూరగాయలు బస్తాలు

కూరగాయలకు గిట్టుబాటు ధర కరువు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో జల్లూరు గ్రామంలో కూరగాయలు పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు రాక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ అనంతరం రబీలో ఈ ప్రాంతంలో అధికంగా కూరగాయలు పండిస్తున్నారు. ప్రధానంగా వంగ, బీర, బెండ, టమోటాలు ఇక్కడ నుంచి వివిధ మండలాలకు రవాణా అవుతాయి. ప్రస్తుతం బెండ, వంగ, టమోటాలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 50 ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నారు. గతంలో వంగ బస్తా రూ.1200 వరకు అమ్మేదని, ప్రస్తుతం 200లకు మించి రాలేదని, అదేవిధంగా బెండ సుమారు 1000 రూపాయల వరకు ఉండేదని, అది కూడా 200 మించి రాలేదని ఆందోళన చెందుతున్నారు. కూలి రేట్లు సైతం రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో తెగ నమ్ముకోవాల్సి వస్తుందని అంటున్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేల పోటీలు

ప్రజాశక్తి-చీడికాడ:మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ గ్రామ దేవత అమ్మవారి ఆలయములో గురువారం విగ్రహ ప్రతిష్టతను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రసాదరావు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు సాయంత్రం జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందాలు నిర్వహించారు.



పరుగు పెడుతున్న ఎడ్లు



నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

తారెత్తిస్తున్న ఎండలు

ప్రజాశక్తి -కోటవురట్ల:మార్చి నెల ముగియకముందే ఎండలు తారేత్తిస్తుండటంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. గురువారం ఎండ వేడిమికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఉదయం 12గంటలకే చిరు వ్యాపారులు, విద్యార్థులు ఎండ వేడిమిని తట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. మార్చి నెలలోనే ఎండలు ఇలా ఉండటంతో రానున్న కాలంలో ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి కెఎ.పాల్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజలకు నిజాయతీగా సేవ చేసేందుకే ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు కెఎ.పాల్ రాజకీయాల్లోకి వచ్చారని సినీ నటుడు బాబూమోహన్ చెప్పారు. రైల్వే న్యూ కాలనీలోని ప్రజాశాంతి పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం యూట్యూబర్స్‌తో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీడియా, ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా విస్తృతి బాగా పెరిగిందన్నారు. ప్రజాశాంతి వంటి పార్టీల అభిప్రాయాలను ప్రజలకు చేరవేయటంలో యూట్యూబర్స్ ముఖ్య భూమిక నిర్వహించాలని కోరారు. డాక్టర్ కెఎ పాల్ ను విశాఖపట్నం నుంచి గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే మన అప్పులను తీరుస్తారని తెలిపారు. పార్టీ నాయకులు రవి, ఎం.బాబూజీ, ఏసు పాదం, ఎం.హనోక్ పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ టీములు చురుకుగా పనిచేయాలి

-విశాఖ జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున
-పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సాధారణ ఎన్నికల కోసం జిల్లాలో నియమించిన వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీములు మరింత చురుకుగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశించారు. సీజర్స్ చేయడంలో రాష్ట్రస్థాయిలో విశాఖ జిల్లా ముందు వరుసలో ఉండేలా అధికారులు కృషిచేయాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎలక్షన్ సీజర్స్ మేనేజ్ మెంట్ సిస్టమ్ (ఇఎస్ఎంఎస్) పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో ఇఎస్ఎంఎస్ ద్వారా కేసులు నమోదు చేయడంలో మరింత పురోగతి కనిపించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ నుంచి ఇప్పటివరకు రూ.53.49 లక్షలు మాత్రమే సీజర్స్ ద్వారా నగదు పట్టుబడిందన్నారు. ఇందులో కొన్ని శాఖల నుంచి ఎటువంటి కేసులూ నమోదుకాలేదని, ఈ విషయంలో ఆయా నోడల్ అధికారులు, ఎన్‌ఫోర్స్ మెంట్ ఏజెన్సీ బృందాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. ముఖ్యంగా ఎయిర్ పోర్ట్ అథారిటీ, పోర్టు ట్రస్ట్, ఆదాయపు పన్ను, కస్టమ్స్, రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్, స్టేట్ జిఎస్‌టి శాఖల అధికారులు సీజర్స్‌పై నిఘాను మరింత పటిష్టం చేయాలన్నారు. ఇకపై ఎన్‌ఫోర్స్ మెంట్ బృందాలు, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లు ఉన్న లొకేషన్లతో పాటు సమస్యాత్మక, సమస్యాత్మక లేని పోలింగ్ స్టేషన్లను ఆయా అధికారులు ముందుగానే పరిశీలించుకోవాలని తెలిపారు. మరో మూడు వారాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందని, ఆ రోజు నుంచి ఎంసిసి టీములు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ మరింత చురుకుగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంసిసి జిల్లా నోడల్ అధికారి, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, రిటర్నింగ్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాఖ జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్ కమిషనర్



ప్రచారం చేస్తున్న ఎంవివి

తూర్పులో 74వ రోజుకు చేరుకున్న ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి నియోజకవర్గంలో చేపట్టిన పాదయాత్ర 74వ రోజు ఎంవిపి.కాలనీ సెక్టార్-2లో సాగింది. గడపగడపకూ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు, పార్టీ నాయకులు, అభిమానులు, పలు కార్పోరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం...

తూర్పు నియోజకవర్గంలో "మేము సిద్ధం మా బూత్ సిద్ధం" సభ 13వ వార్డు పరిధి పాండురంగాపురంలో గురువారం నిర్వహించారు. ఈ సభకు ఎంవివి. సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంవివి సత్యనారాయణ మాట్లాడుతూ, తూర్పు నియోజకవర్గంలో సంక్షేమ పథకాలను అందించడంతోపాటు ఎన్నో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ, తూర్పు నియోజవర్గంలో వెలగపూడి రామకృష్ణబాబు మూడు పర్యాయాలు గెలిచినా ఏ విధమైన అభివృద్ధీ చేయలేదన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, నాయకులు కెల్ల సత్యనారాయణ, మొల్లి అప్పారావు, అల్లంపల్లి రాజబాబు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

మెడికల్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని కొర్రయి పంచాయితీ గత్తరజిల్లేడ జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ షాపును ఆ పంచాయతీ సర్పంచ్ కొములు ప్రారంభించారు.

డాక్టర్ బూసి వెంకటస్వామికి మద్రాస్ వర్సిటీ ఉగాది పురస్కారం



ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఏటా ఉగాదిని పురస్కరించుకుని అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేసే ఉగాది పురస్కారం ఈ ఏడాది ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బూసి వెంకటస్వామి ఎంపికయ్యారు. వచ్చేనెల 5న చెన్నయిలోని మద్రాస్ విశ్వవిద్యాలయ మెరీనా క్యాంపస్‌లో నిర్వహించే ఉగాది వేడుకల్లో డాక్టర్ వెంకటస్వామికి సినీగేయరచయిత భువనచంద్ర అవార్డును ప్రదానం చేయనున్నట్లు వర్సిటీ తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు వెల్లడించారు. .తెలుగు సాహిత్యం, తెలుగు భాష కోసం విశేషకృషిచేసే ప్రముఖులకు ఏటా మద్రాసు విశ్వవిద్యాలయం కోసం కషిచేసే ప్రముఖులకు ఉగాది పురస్కారాన్ని అందజేస్తోంది.ఈ ఏడాది పురస్కార గ్రహీత డాక్టర్ వెంకటస్వామికి ఇప్పటికే గురజాడ పురస్కారం, దాశరథి స్మారక పురస్కారం, గుర్రం జాషువా పురస్కారాలతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు, గురుబ్రహ్మ, ఆచార్య దేవోభవ, మిశ్రమంజరి అవార్డులు వరించాయి. పలు జాతీయ అంతర్జాతీయ జర్నల్స్‌లో 125 పరిశోధనా పత్రాలు ప్రచురించబడ్డాయి.150 జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పత్ర సమర్పణ చేసారు. తనకు మద్రాస్ విశ్వవిద్యాలయం ఉగాది పురస్కారాన్ని ప్రకటించటం ఆనందంగా ఉందని డాక్టర్ బూసి వెంకటస్వామి అన్నారు. వెంకటస్వామికి ఉగాది పురస్కారం ప్రకటించడంపై ఎయు తెలుగు ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు, తెలుగు సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.